# పరమార్థ కథలు

## 1. నిజమైన ఆస్థి

ఓసారి ఓ ఆశ్రమంలోని ఆధ్యాత్మిక మిత్రులు అక్కడికి వచ్చిన ఓ వ్యాపారిని అడిగారు.

"మీ మొత్తం ఆస్తి విలువ ఎంతుంటుంది?"

"చూసి చెప్తాను."

అతను మర్నాడు రెండు లెడ్జర్ పుస్తకాలని తన వెంట ఆశ్రమానికి తీసుకువెళ్ళి మొదటిదాన్ని చూపించి చెప్పాడు.

"ఇందులో నా ఇంటి విలువ, వ్యాపారం విలువ, బేంకులో, షేర్లల్లో దాచుకున్న సొమ్ము విలువ, ఇతర ఆస్తుల విలువలు వున్నాయి."

వారు దాన్ని పరిశీలించాక చెప్పాడాయన మళ్ళీ.

"నేను సంపాదించిన ఈ ఆస్తిని ఏ కారణంగానైనా ప్రభుత్వం వేలం వేయచ్చు. అగ్నికి ఆహుతి అవచ్చు. లేదా దొంగలు దోచుకోవచ్చు."

తర్వాత ఇంకో లెడ్జర్‌ని ఇచ్చి చెప్పాడు.

"కాని ఎవరూ తీసుకోలేని నా నిజమైన ఆస్థి ఇదే."

అందులో అతను చాలాకాలంగా బీదలకి చేసిన అనేక రకాల దానాల జాబితా వుంది.